వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 186 బుధవారం | 24 జనవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5





## లక్ష్య సాధన దిశగా బాలికలు కృషి చేయాలి

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

ఘనంగా జాతీయ బాలిక దినోత్సవం

ఉత్తమ ఫలితాలు సాధించిన పది, ఇంటర్ బాలికలకు రూ.లక్ష నగదు ప్రోత్సాహం




## బీజేపీ బలోపేతానికి కృషి

వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్




## ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలి

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

అగ్రంపాడ్ జాతర బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన




## విద్యతోనే సమాజంలో గౌరవం

శాస్త్రీయ ప్రణాళిక పునశ్చరణతో పరీక్షల్లో విజయం

అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్స టోప్పో

10వ తరగతి విద్యార్థులకు జిల్లావ్యాప్త ప్రేరణ కార్యక్రమం ప్రారంభం




# భేష్.. బల్దియా

వివరాలు 2లో..



## అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్ ట్రీట్ మెంట్

### ఫుట్ పాత్, రహదారుల ఆక్రమణలపై జీడబ్ల్యూఎంసీ నజర్

### జూలు విదిల్చిన అధికారులు

### నోటీసులకు స్పందించకుంటే కూల్చివేతలే..

### సర్వత్రా హర్షం

ఇంతకాలం స్థబ్దుగా ఉన్న జీడబ్ల్యూఎంసీ అధికారులు జూలు విదుల్చుతున్నారు. అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. నోటీసులిచ్చినా స్పందించని భవన యజమానుల పని పడుతున్నారు. గ్రేటర్ వరంగల్ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా బడా షాపింగ్ మాల్స్, బిల్డింగులను వేటినీ వదలకుండా బుల్డోజర్లతో నేలమట్టం చేస్తున్నారు. వారం రోజుల్లో అక్రమ నిర్మాణాలకు సంబంధించిన సవరణలు చేపట్టకుంటే కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరిస్తున్నారు. ఫుట్‌పాత్‌లు, రహదారుల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇంతకాలం రాజకీయ ఒత్తిళ్లతో కళ్లు, చెవులు మూసుకున్న గ్రేటర్ అధికారులు జనం కోసమే మనం అంటూ వారి సమస్యల పరిష్కారానికి నడుం బిగిస్తున్నారు. అధికారుల్లో వచ్చిన ఈ మార్పుకు జనం అబ్బురపడుతున్నారు. అక్రమ నిర్మాణాలను అరికడితే నగరంలోని సగం ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందంటూ సూచిస్తున్నారు. ప్రజా సంక్షేమం దృష్ట్యా అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని నగర ప్రజలు కోరుతున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్

# భేష్.. బల్దియా

**అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్ ట్రీట్ మెంట్**

**ఫుట్ పాత్, రహదారుల ఆక్రమణలపై జీడబ్ల్యూఎంసీ నజర్**

**జూలు విదిల్చిన అధికారులు**

**నోటీసులకు స్పందించకుంటే కూల్చివేతలే..**

**మొన్న హనుమకొండలో.. నిన్న వరంగల్‌లో.. సర్వత్రా హర్షం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ పరిధిలో మునుపెన్నడూ లేని విధంగా జీడబ్ల్యూఎంసీ అధికారులు అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రహదారులు, ఫుట్ పాత్ లను ఆక్రమించిన చిన్న దుకాణాలు మొదలు బడా షాపింగ్ మాల్స్ వరకు ఎవరినీ వదలకుండా నేలమట్టం చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మునిసిపల్ సమస్యలపై దృష్టి సారించారు. ఇప్పటికే జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హనుమకొండ కలెక్టరేట్ లో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. నిబంధనల మేరకు నగరాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అక్రమ నిర్మాణాలపై ఉపేక్షించేది లేదన్నారు. ప్రభుత్వానికి చెందిన గజం భూమి కూడా ఆక్రమణకు గురి కాకూడదంటూ సూచించారు. అక్రమ నిర్మాణాలపై తమ పని తాము చేసుకోవాలంటూ సూచించారు. మీపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఉండవంటూ హామీ ఇచ్చారు. నిబంధనలకు అతిక్రమిస్తే మాత్రం చర్యలు తప్పవంటూ హెచ్చరించారు.



**పన్ను చెల్లించని షాపు సీజ్..**

లష్కర్ బజార్ కు చెందిన ఇండియన్ టేర్రైయిన్ నిర్వాహకులు గత రెండు సంవత్సరాలుగా బల్దియాకు పన్నులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేశారని బల్దియా రెవెన్యూ అధికారి యూసుఫోద్దీన్ తెలిపారు. పలు మార్లు పన్ను చెల్లించాలని కోరినా స్పందన లేకపోవడంతో రెడ్ నోటీస్ జారీ చేశామని అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో కమిషనర్ ఆదేశం మేరకు అట్టి షాప్ ను సీజ్ చేయడంతోపాటు యజమానికి రూ.80,448 పెనాల్టీ విధించామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ భరత్ చంద్ర, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.




**అంతా సన్నిహితులే..**

గ్రేటర్ పరిధిలోని బడా షాపింగ్ మాల్స్ నిర్వాహకులు, పెద్ద పెద్ద భవనాల యజమానులంతా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీఆర్ ఎస్ పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల సన్నిహితులకు చెందినవే. వారితో రాసుకొని, పూసుకొని ఉండడంతోపాటు లీడర్లకు ఫైనాన్షియల్ సపోర్టుగా నిలిచినవారే. దీంతో ప్రజలనుంచి ఫిర్యాదులు వెల్లువెత్తినా ఏమీ చేయలేని పరిస్థితి అధికారులది. చర్యలు తీసుకునేందుకు సైట్ మీదకు వెళ్లిన బల్దియా, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వెనక్కి తిరిగి వచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

**నిన్న హనుమకొండలో..**

గ్రేటర్ పరిధిలోని కాజీపేట జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు ఉన్న ఆక్రమణల తొలగింపునకు ఈనెల 10న బల్దియా అధికారులు శ్రీకారం చుట్టారు. పలు బడా షాపింగ్ మాల్స్, కంపెనీ షోరూంలు, హోటల్స్, రెస్టారెంట్ల ఎదుట ఫుట్ పాత్ లపై ఇష్టారీతిన ఉన్న నిర్మాణాలను బుల్డోజర్లతో తుక్కుతుక్కు చేశారు. మంగళవారం వరంగల్ చౌరస్తాలోని ప్రముఖ వ్యాపారికి చెందిన వస్త్ర షాపింగ్ మాల్ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపారు. సెల్ల్ పోర్షన్ పార్కింగ్ గోడలు, హోర్డింగ్స్, బోర్డులను కూల్చివేశారు. ఆక్యుపెన్సీ ప్రకారం అనుమతి తీసుకోనందున విద్యుత్ సరఫరాను తొలగించాలంటూ ఎన్ పీడీసీఎల్ కు లేఖ రాశారు. అనంతరం వరంగల్ చౌరస్తా నుంచి పోచమ్మమైదాన్ వరకు ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.

**కూల్చివేతలే..**

బిల్డింగులు, షాపింగ్ మాల్స్ తీసుకున్న పర్మిషన్లు, నిర్మాణాలను బేరీజు వేసుకుని నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటికి బల్దియా అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. విరుద్ధంగా ఉంటే వారం రోజుల్లో సరి చేసుకోవాలని సూచిస్తున్నారు. కాదు..కూడదంటే కూల్చివేతలు తప్పవంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట, మడికొండ, నక్కల గుట్ట, అదాలత్, సుబేదారి, నయీంనగర్, కేయూసీ జంక్షన్, కరీంనగర్, స్టేషన్ రోడ్, జేపీఎన్ రోడ్, దేశాయిపేట పరిధిలోని అక్రమ నిర్మాణాలపై త్వరలోనే కూల్చివేతలు ఉంటాయంటూ హెచ్చరిస్తున్నారు.

**ఏనుమాముల 100 ఫీట్ల రోడ్‌లో..**

బల్దియా పరిధి ఏనుమాముల 100 ఫీట్ రోడ్ ప్రాంతంలో కబ్జా చేసి నిర్మించిన కట్టడాన్ని బల్దియా టౌన్ ప్లానింగ్, డీఆర్ ఎఫ్ విభాగాలు, పోలీసుల సహకారంతో బుధవారం కూల్చివేసినట్లు సిటీ ప్లానర్ వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఏనుమాముల సమీపంలో వంద ఫీట్ ల రోడ్డును ఆక్రమించుకొని అక్రమంగా ఇంటి నిర్మాణం చేసిన యజమానికి నోటీసులు జారీ చేసినప్పటికీ ఎలాంటి వివరణ రాలేదన్నారు. దీనికితోడు ఇంటికి తాళం వేసి ఉండడంతో పోలీసుల సమక్షంలో వీడియో రికార్డింగ్ ద్వారా పంచనామా నిర్వహించి కూల్చి వేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీబీఓలు శ్రీకాంత్, నరేందర్, రాజు నాయక్, సంధ్య రాణితో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యతోనే సమాజంలో గౌరవం

**శాస్త్రీయ ప్రణాళిక పునశ్చరణతో పరీక్షల్లో విజయం**

**అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్స టోప్పో**

**10వ తరగతి విద్యార్థులకు జిల్లావ్యాప్త ప్రేరణ కార్యక్రమం ప్రారంభం**

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** విద్యతోనే సమాజంలో గౌరవం, ముందడుగు సాధ్యమని అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ లెనిన్ వత్స టోప్పో అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థుల పరీక్ష ఫలితాల శాతాన్ని పెంపొందించుటకై నిర్వహించే జిల్లావ్యాప్త ప్రేరణ కార్యక్రమాన్ని, సంబంధిత కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్లను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ శాస్త్రీయ ప్రణాళిక–పునస్చరణతో పరీక్షల్లో విజయం సాధించవచ్చన్నారు. విద్యార్థులు చదువుకునే వయసులోనే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. చదువు అనే నిచ్చెనతో ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చన్నారు. విద్యార్థులు ఇటువంటి ప్రేరణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవలని అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్స టోప్పో తెలిపారు. ఈ సందర్భంగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించే ఉచిత ప్రేరణ సదస్సుల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల పరీక్ష ఫలితాలను పెంపొందించుట కొరకు పరీక్షల్లో విజయం సాధించాలంటే అనే అంశంపై ఉచితంగా ప్రేరణ సదస్సులు సైకాలజిస్టుల సంఘం సహకారంతో నిర్వహించనున్నామన్నారు. విద్యార్థులు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సద్వినియోగపరచుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9989310141 లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ డేవిడ్.వి.ఏలియా, జడ్పీ సీఈఓ రమాదేవి, జడ్పీ డిప్యూటీ సీఈవో నర్మదా, సీడీపీఓ శిరీష, జీసీడీఓ విజయ్ కుమారి, డీఎంహెచ్ ఓ డాక్టర్ అంబరీష తదితరులు పాల్గొన్నారు.

# బీసీల సమగ్రాభివృద్ధిపై దృష్టి పెట్టండి

**ముఖ్యమంత్రికి దాసు సురేష్ వినతి**

**మంత్రి పొన్నంతో సమావేశం**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దశాబ్ద కాలంగా తెలంగాణలో అపరిష్కృతంగా ఉన్న బీసీ సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యాలయానికి గతవారం నివేదికను సమర్పించామని అట్టి విషయాలపై బీసీ మంత్రి పొన్నంప్రభాకర్ తో సమావేశమయ్యామని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ బుధవారం సెక్రటేరియట్ లోని మీడియా పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో బీసీలు రాజకీయంగా తీవ్రంగా నష్టపోయారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో సమగ్రంగా వివరించామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కో ఆపరేటివ్ సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 19 శాతానికి తగ్గించి బీసీ కార్పొరేషన్లు ఫెడరేషన్లకు పాలకమండళ్లను నియమించకుండా బీసీ నాయకత్వాన్ని అడుగడుగునా అణచివేసిన వైనాన్ని వివరించామన్నారు. ప్రభుత్వం త్వరలో ప్రకటించబోయే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లేఖలో కోరినట్లు తెలిపారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ తో జరిగిన సమావేశంలో తెలంగాణలో బీసీల జనగణన, బీసీ డిక్లరేషన్ అమలు, బీసీల విద్యా ఉద్యోగ ఉపాధి అవకాశాలపై చర్చించామని దాసు సురేష్ మీడియాకు వివరించారు. అద్దె భవనాలలో కొనసాగుతున్న బీసీ గురుకులాలకు సొంత భవనాలను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. విద్యపై బడ్జెట్ కేటాయింపులను కేసీఆర్ ప్రభుత్వం క్రమంగా తగ్గించడాన్ని సంఖ్యాపరంగా మంత్రికి వివరించారు. 2014–15 వార్షిక బడ్జెట్ లో 10.89 శాతం విద్య కోసం వెచ్చించగా 2022–23 నాటికి బడ్జెట్లో కేవలం 6.24 శాతం మాత్రమే వెచ్చించి ప్రైవేట్ యూనివర్సిటీలకు తెరతీసిందన్నారు. తద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీలు రిజర్వేషన్లను కోల్పోయి విద్యకు దూరమయ్యారన్నారు. కొత్తగా ప్రారంభమైన ప్రైవేట్ యూనివర్సిటీలలో బీసీలకు రిజర్వేషన్లు సాధ్యమయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్సును జారీ చేయాలని మంత్రిని దాసు సురేష్ కోరారు. బీసీ సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని త్వరలోనే బీసీ సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారని దాసు సురేష్ మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి గౌరవ అధ్యక్షులు దొంత ఆనందం, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు భండారి పద్మావతి, ప్రధాన కార్యదర్శి ప్యారసాని దుర్గేష్, గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ బింగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 26న బైక్ ర్యాలీని జయప్రదం చేయండి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 26న వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి ఎంజీఎం సెంటర్ వరకు జరుగు బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం నగరంలోని గవి చర్ల క్రాస్ జంక్షన్ వద్ద అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్), భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్ టీయూ)ల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి, ఐఎఫ్ టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ అధ్యక్షత వహించగా ఐఎఫ్ టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాచర్ల బాలరాజు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం తన పది సంవత్సరాల కాలంలో ప్రజావ్యతిరేక విధానాలను అవలంబించిందన్నారు. ఈ ప్రభుత్వం చేసిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను ఉపసంహరించుకునే సమయంలో దేశ రైతాంగ నాయకులకు ఇచ్చిన హామీలను తుంగలో త్రొక్కిందని వారు విమర్శించారు. పంటల మద్దతు ధర హక్కు చట్టం, రుణ విమోచన చట్టం, చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ పార్లమెంటు వద్ద కొంతమంది నిరసనకారులు తెలియజేసిన ఆందోళనకు సమాధానం చెప్పలేక వారిపై ఉపా లాంటి నల్ల చట్టాలను ప్రయోగించిందని, వారిని వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, అక్బర్, కృష్ణ, హరిబాబు, కరుణాకర్, సాంబయ్యలతో పాటు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోండి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ మున్సిపల్ పరిధిలోని రెండో వార్డులోని బూత్ కన్వీనర్, సభ్యులు కలిసి 56వ బూత్ లో చదువుకున్న విద్యార్థిని విద్యార్థులు ఎమ్మెల్సీ పట్టభద్రులుగా కలిగి ఉన్న గ్రాడ్యుయేట్స్ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. వాడలో తిరుగుతూ డిగ్రీ ఉత్తీర్ణులైన, డిప్లమా పట్టా కలిగినటువంటి ప్రొవిజినల్, ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు కలిగి యుండి అర్హులైన విద్యార్థిని విద్యార్థులను వివరాలు సేకరించారు. ఓటును వినియోగించుకోనేందుకు పట్టభద్రలు ముందుకు రావాలని ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల ఎస్సీ సెల్ అధ్యక్షులు, బూత్ కన్వీనర్ బొమ్మకంటి చంద్రమౌళి, బూత్ సభ్యులు బొచ్చు కట్టయ్య, బొచ్చు అనంత్, బోచ్చు రాజు, బొచ్చు కవిత, బొచ్చు అనిల్, మడికొండ లలిత పాల్గొన్నారు.

## జిమ్ నిర్మాణానికి మూల కృషి



**వరంగల్ వాయిస్, బయ్యారం :** స్థానిక బయ్యారంలోని ప్రజల కోరిక మేరకు అప్పటి మంత్రి సత్యవతి రాథోడ్ ను బిందుతో కలిసి అడిగి నిధులు తీసుకొచ్చి మండల ప్రజల కోరిక తీర్చిన మధుకర్ రెడ్డికి స్థానిక ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని రోడ్ల నిర్మాణానికి, చెరువు కాలువల మరమత్తుల కోసం రూ.2కోట్ల పైనే నిధులు తీసుకొచ్చిన ఘనత మూల మధుకర్రెడ్డికి దక్కుతుందన్నారు. అదే విధంగా బయ్యారంలో రెండు గుట్టల మధ్య కాకతీయులు నిర్మించిన చెరువు పూడిక తీసేందుకు, అలుగుల ఎత్తు పెంచి కట్ట నిర్మాణం చేపట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి నిధులు తేవాలని ప్రజలు కోరుతున్నారు.

# దురదృష్టవశాత్తు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడలేదు

### మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా మనం ప్రజల పక్షమేనని వర్ధన్నపేట మాజీ శాసన సభ్యుడు అరూరి రమేష్ అన్నారు. హంటర్ రోడ్డు పార్టీ కార్యాలయంలో గ్రేటర్ వరంగల్ 43వ డివిజన్ అధ్యక్షుడు అక్కేనపల్లి స్పందన్ అధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో అరూరి రమేష్ హాజరై మాట్లాడుతూ దురదృష్టవశాత్తూ మన ప్రభుత్వం ఏర్పడలేదని, ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా, నియోజకవర్గాన్ని చాలా అభివృద్ధి చేసినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో ప్రజలను నమ్మించిందని, ఇప్పటికైనా హామీలను నెరవేర్చాలని, ఓటమికి కుంగిపోవద్దు మనం అధికారంలో ఉన్న పొంగిపోలేదు. ఇపుడు అధికారం లేదని కుంగిపోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల మధ్య ఉంటూ ప్రజల పక్షాన పోరడుదామని అన్నారు. గ్రేటర్ వరంగల్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన నిధులను రద్దు చేయాలని చూస్తుందని, రోడ్లు, భవనాల వంటి ప్రజా ప్రయోజన మౌలిక వసతుల కోసం కేటాయించిన నిధులను రద్దు చేయొద్దని సూచించారు. కార్యకర్తలు ఎవరు అధైర్య పడొద్దని, అన్నివేళలా అందుబాటులో ఉంటూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పదవిలో ఉన్న లేకపోయినా ప్రజా సమస్యలపై పోరాటం చేద్దామన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం చేయడమే ప్రథమ కర్తవ్యమని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ జిల్లాలో గులాబీ జెండా ఎగిరెలా కార్యాచరణ రూపొందించుకొని ముందుకు వెళదామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ అరుణ-విక్టర్, డివిజన్ మహిళ అధ్యక్షురాలు రాణి, డివిజన్ ప్రధాన కార్యదర్శులు హనుమన్ రెడ్డి, రవి, పాక్స్ డైరెక్టర్ షణ్ముఖ రెడ్డి, నాయకులు రాములు, వెంకట్ రెడ్డి, జగపతి, బాబు, జయశంకర్, క్రాంతి, జీవంత్ రెడ్డి, సారయ్య, గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడం హర్షణీయం

### బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీహార్ మాజీ ముఖ్యమంత్రి ప్రముఖ సోషలిస్టు నాయకులు కర్పూరి ఠాకూర్‌కు శతజయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన భారతరత్న ప్రకటించడం హర్షణీయమని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు తెలిపారు. వారందించిన స్ఫూర్తితోనే నేడు దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం కోసం, చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్ల కోసం ఆందోళనలు తీవ్ర స్థాయిలో జరుగుతున్నాయన్నారు. తొమ్మిదేండ్లుగా బీసీల ఎడల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా దేశవ్యాప్తంగా కులగణనను చేపట్టాలని, పార్లమెంటు ఎన్నికలకు ముందే చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింప చేయాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.

### ఠాకూర్ గొప్ప మానవతావాది..

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జననాయక్ శ్రీ కర్పూరీ ఠాకూర్ కు భారతరత్న ఇవ్వడం పట్ల సెలూన్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగవెల్లి సురేష్ కు మార్ హర్షం వ్యక్తం చేశారు. నిరుపేద నాయీబ్రాహ్మణ కులవృత్తి చేసుకునే కుటుంబంలో పుట్టి బీహార్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రెండు పర్యాయాలు పని చేశారన్నారు. ఆయనకు భారత దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వడం పట్ల నాయీ బ్రాహ్మణ సమాజం తరపున భారతీయ జనతా పార్టీకి, భారత ప్రధాని నరేంద్ర మోదీకి హార్థిక కృతజ్ఞతలు తెలియజేశారు.

## విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఏబీవీపీ, సామా జగన్ మోహన్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాకతీయ హెరిటేజ్-2024 క్రీడా పోటీలు నిర్వహిస్తున్నాయి. ఈ పోటీల్లో భాగంగా బుధవారం రెండవ రోజు పోటీలు కళాశాలలో నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు మాచర్ల రాంబాబు కర్ణాకర్ సార్ పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పాటునిస్తాయని అన్నారు. విద్యార్థులందరూ సమాజానికి ఉపయోగపడే గొప్ప వ్యక్తులుగా తయారు కావాలన్నారు. అదేవిధంగా దేశం, సమాజం పట్ల ఆలోచించాలని, విద్యార్థులు విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్వామి వివేకానంద చూపిన బాటలో నడవాలన్నారు. దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా విద్యార్థి పరిషత్ విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంత సంఘటన కార్యదర్శి తోట లవణ్ కుమార్, విభాగ్ సంఘటన కార్యదర్శి కుంట హర్షవర్ధన్, విభాగ్ కన్వీనర్ అయితే నిఖిల్, హనుమకొండ జిల్లా కన్వీనర్ ఆరేపల్లి సుజిత్, వరంగల్ జిల్లా కన్వీనర్ దేవేందర్, గేమ్స్ కన్వీనర్ మరోజు యశ్వంత్, జోనల్ ఇంచార్జ్ శ్రవణ్ కుమార్, మనోజ్, హరిచరణ్, గాంధీ, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ బాలికా దినోత్సవ ర్యాలీ



**వరంగల్ వాయిస్, పరకాల :** నడికూడ మండలం చర్లపల్లి గ్రామంలోని అంగన్వాడీ సెంటర్ ఒకటి, రెండు భీముడు లక్ష్మి నందిపాటి సంధ్య టీచర్ల ఆధ్వర్యంలో బాలికా దినోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ విచ్చేసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు, అంగన్వాడీ టీచర్స్, ఆయాలు మహిళ ఉపాధ్యాయులు బేటి బచావో బేటి పడావో, బాలికల చదువు భవితకు వెలుగు, నేటి బాలిక రేపటి అమ్మ, ఆడపిల్లను పుట్టనిద్దాం ఆడపిల్లని ఎదగనిద్దాం అంటూ నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్వాడీ టీచర్ భీముడి లక్ష్మి మాట్లాడుతూ ఆడపిల్ల లేని ఇల్లు చందమామ లేని ఆకాశం ఒకటేనని, అందుకే ప్రతి ఇంటిలో వెన్నెల లాగా ఒక కూతురు ఉండాలని, ఆడపిల్ల దేశానికే గర్వకారణమని అన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు నిగ్గుల శ్రీదేవి మాట్లాడుతూ నేటి బాలిక రేపటి అమ్మని, ప్రతి ఇంటికి మణిదీపం బాలిక అని, భరతమాతకు మరో రూపమే బాలికా అని, బాలికలు లేకుంటే భవిష్యత్తే అంధకారమని, బాలికల సంరక్షణలో భారతదేశం వెలుగొందాలని ఆశిద్దామన్నారు. అనంతరం అంగన్వాడీ టీచర్ నందిపాటి సంధ్య బాలికలతో మహిళా ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు నిగ్గుల శ్రీదేవి, అంగన్వాడి టీచర్స్ బీముడు లక్ష్మీ, నందిపాటి సంధ్య, విద్యా వాలంటీర్ పర్షవేని జ్యోతి, ఆయాలు అరుణ, సుశీల, సరోజన, విద్యా వాలంటీర్ బాబురావు, ఐఆర్పీ రమేష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 16న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కరీమాబాద్ ఏరియాలో స్కూల్ హెడ్మాస్టర్లకు బుధవారం సమ్మె నోటీసులు అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని సంతకాల సేకరణ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి రాష్ట్ర నాయకులు కాసు మాధవి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు గత ఆరు నెలల నుంచి వేతనాలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం కోడిగుడ్డుకు ఐదు రూపాయలు కట్టిస్తే ఏడు రూపాయలు పెట్టి పిల్లలకు కోడిగుడ్లు వండి పెడుతున్న పరిస్థితి ఉంది. అలాగే మిక్స్ కర్రీస్, జావా అనేక రకాల కూరగాయలు పెట్టాలని ప్రభుత్వం, అధికారుల నుంచి ఒత్తిడి వస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజన కార్మికులను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించి స్వచ్ఛంద సంస్థలకు అప్పజెప్పాలని ప్రయత్నం జరుగుతుందన్నారు. అందుకోసమే బీజేపీ ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16న జరుగు సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, ఫిబ్రవరి 16న జరుగు సమ్మెలో పాల్గొనాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సాంబ లక్ష్మి, రమ, రజిని, నాజియా, శ్యామల, విమల, కొమరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ రాచర్ల ప్రభాకర్ మృతి

### సంతాపం తెలిపిన తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భూపాలపల్లిలో ఆంధ్రప్రభ సీనియర్ జర్నలిస్ట్ రాచర్ల ప్రభాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందినాడనే వార్త దిగ్భ్రాంతిని కలిగించిందని సీపీఐ రాష్ట్ర నాయకుడు తాటిపాముల వెంకట్రాములు తెలియజేశారు. సుదీర్ఘ కాలంగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతూ ఆ వృత్తికే వన్నె తెచ్చిన ప్రభాకర్ ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు కథనాలు రాసి ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలిచారన్నారు. భూపాలపల్లి ప్రాంత అభివృద్ధికి పాత్రికేయుడిగా వారు చేసిన కృషి మరువలేనిదన్నారు. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో, ప్రస్తుతం భూపాలపల్లి జిల్లాలో జర్నలిస్టుల యూనియన్ ను బలోపేతం చేయడానికి వారు చిత్తశుద్ధితో పనిచేసి ఆదర్శ ప్రాయుడిగా నిలిచారన్నారు. ప్రభాకర్ మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసి వారి కుటుంబ సభ్యులకు వెంకట్రాములు సానుభూతిని తెలియజేశారు. శోకసంద్రంలో ఉన్న వారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

## దేవాలయ నిర్మాణానికి విరాళం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండలంలోని సోమయ్యకుంట తండాలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా జడ్పీటీసీ సభ్యుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నేత గుడి వంశీధర్ రెడ్డి బుధవారం హైదరాబాద్ లో తనని కలిసిన వారికి రూ.50000 ఆర్థిక సాయం అందించారు.. రఘునాథపల్లి మండలం సోమయ్యకుంట తండాకు చెందిన గ్రామస్తులు అతన్ని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ పుట్టిన గ్రామానికి సేవ చేయాలనే తపనతో విరాళం ఇచ్చినట్లు తెలిపారు. మండలంలో వివిధ గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులతో పాటు ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం చేయడం జరిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బిక్కు నాయక్ , గుగొలోతు బిక్కు నాయక్, కేతవత్ నారసిహ్మా నాయక్,గోగులోతు రాజు , గుగులోతు తిరుపతి, గుగొలుతు ఇరియా, గూగులోతు భాస్కర్ పాల్గొన్నారు.

## క్యాట్ ఆల్ ఇండియా ఫలితాల్లో శ్రీ చైతన్య విజయ దుందుభి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నక్కలగుట్ట శ్రీచైతన్య సి బ్రాంచ్ విద్యార్థులు క్యాట్ ఆల్ ఇండియా నాలెడ్జ్ అసిస్ మెంట్ టెస్ట్ ఫలితాల్లో సత్తా చాటి ఇరువై ఒకటి వేయిల భారీ నగదు బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఎజీయం.రాజేశ్వర్ రెడ్డి జడ్ ఏసీ మహేష్ విజేతలైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నళిని మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా విద్యార్థులను ఇంజినీర్లుగా వైద్యులుగా తీర్చిదిద్దిన ఘనత మా శ్రీచైతన్య విద్యాసంస్థలదని అన్నారు. పాఠశాల డీన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువులో పోటీ తత్వాన్ని పెంపోదించుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో క్యాట్ ఇంచార్జి కిషన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముస్తఫాకు రక్తవీర్ పురస్కార్



**వరంగల్ వాయిస్, పరకాల :** నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతిని మంగళవారం లూయిస్ అంధుల ఆదర్శ పాఠశాల ఆటోనగర్, వరంగల్ లో యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పరకాల పట్టణానికి చెందిన ఎస్కే ముస్తఫాకు సమాజ సేవ, రక్తదానం చేస్తూ రక్తదానంపై అవగాహన కల్పిస్తూ, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నందుకు గాను రక్తవీర్ పురస్కార్ -2024 అవార్డు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షుడు కె.అరుణ్ కుమార్, ఉపాధ్యక్షుడు కన్నె రాజు, వరంగల్ కాంటెస్టడ్ ఎమ్మెల్యే ఎర్రబెల్లి ప్రదీప్ రావు, డాక్టర్ మేఘన, డాక్టర్ అజిత్, మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా క్రీడా అధికారికి ఎమ్మెల్యే నాయిని శుభాకాంక్షలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇటీవల ఢిల్లీలో డిసెంబర్ 26 నుంచి 29 వరకు జరిగిన స్కూల్ గేమ్స్ నేషనల్స్ లో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ హనుమకొండ జిల్లా నందు రెజ్లింగ్ క్రీడలో శిక్షణ పొందుతున్న క్రీడాకారుల్లో ఇద్దరు క్రీడాకారులు ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఎంపికయ్యారు. ఇందులో ఏ.రాహుల్ గ్రీకోరోమన్ 55కేజీల బరువు విభాగంలో కాంస్య పతకం సాధించగా, వి.గణేష్ గ్రీకోరోమన్ 65కేజీల బరువు విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఖేలో ఇండియా యూత్ గేమ్స్ కు ఎంపికవడం జరిగింది. జిల్లా యువజన, క్రీడల అధికారి గుగులోత్ అశోక్ కుమార్, తెలంగాణ ఖేలో ఇండియా టీం కోచ్ గా ఎంపికైనందున వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాకారులను నాయిని రాజేందర్ రెడ్డి , జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, ఒలంపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహమ్మద్ అజీజ్ ఖాన్, జిల్లా యువజన, క్రీడా అధికారి, హనుమకొండ జిల్లా గుగులోత్ అశోక్ కుమార్, శిక్షకుడు కందికొండ రాజు, కోచ్ లు, సిబ్బంది అభినందించి సన్మానించినారు. ఈనెల 26 నుంచి 31వరకు తమిళనాడులో జరగబోయే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లో అత్యుత్తమంగా రాణించి హనుమకొండ జిల్లాకు పథకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## న్యాక్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు శిక్షణ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పరకాల, నడికూడ, దామెర, ఆత్మకూర్, శాయంపేట, మండలాల నిరుద్యోగ యువతీ యువకులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ ఆకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (ఎన్.ఎ.సీ), లేబర్ డిపార్ట్ మెంట్ ల్యాండ్ సర్వేయర్ డిపెండెంట్ ట్రైనింగ్ 3నెలల శిక్షణ, ఉఫాధి కార్యక్రమం ప్రారంభించినట్లు అసిస్టెంట్ డైరెక్టర్ పి అశోక్ కుమార్ తెలిపారు. ఈ ట్రైనింగ్ పీరియడ్ లో ఉచితంగా యూనిఫాం, స్టేషనరీ ఐటమ్స్, మధ్యాహ్న భోజనంతో పాటు న్యాక్ నుంచి స్కిల్ సర్టిఫికెట్ తో పాటు నిర్మాణ రంగ కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. ఈ సంస్థ కల్పించే కోర్సు ల్యాండ్ సర్వేయర్. శిక్షణ కాలం మూడు నెలలు. శిక్షణకు ఇంటర్ పాస్ లేదా ఐటీఐ, డిప్లమా చేసిన వారిని ఎంపిక చేస్తారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వరకు వయసు కలిగి ఉండాలని, ఈ శిక్షణ కాలంలో అభ్యర్థులకు మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తారు. ఆసక్తిగల అభ్యర్థులు పూర్తి బయోడేటా తో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ , క్యాస్ట్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు, తండ్రి లేదా తల్లి లేబర్ కార్డు, నాలుగు కలర్ ఫోటోలతో పరకాల ఎస్సీ హాస్టల్ ఆర్డీఓ ఆఫీస్ వెనకాల న్యాక్ ట్రైనింగ్ సెంటర్ లో అడ్మిషన్ కోసం ఈ సర్టిఫికెట్స్ సమర్పించి మీ పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 9441975438 , 9581483526 అనే నెంబర్లకు ఫోన్ చేయవచ్చని అసిస్టెంట్ డైరెక్టర్ పి అశోక్ కుమార్ తెలియజేశారు.

## సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 7వ డివిజన్ లోని కంచరకుంటలో రూ.65లక్షల నిధులతో అంతర్గత సీసీ రోడ్లు, అభివృద్ధి కార్యక్రమాలకు బుధవారం వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, స్థానిక 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ లు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ 7వ డివిజన్ లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడం నాకు చాలా సంతోషకరమని, అలాగే డివిజన్ లో అనేక రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని, డివిజన్ అభివృద్ధి ఏకైక లక్ష్యమని, 7వ డివిజన్ ని ఆదర్శ డివిజన్ గా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మొహమ్మద్ అజీజ్ ఖాన్, ఎంపీ ఆనంద్, బొజ్జ సమ్మయ్య యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, మంద రాకేశ్, నాగ సోమేశ్వర్ రావు, దినేష్, తోట పవన్ పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

## విగ్రహావిష్కరణకు అందరూ తరలి రావాలి
## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని విగ్రహావిష్కరణకు అందరూ తరలి రావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. హనుమకొండలో బాలసముద్రంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సుర్జిత్ నగర్ అభివృద్ధి కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కారు ఉపేందర్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న 31వ డివిజన్ న్యూ శాంపేటలో గల సుర్జీత్ నగర్ లో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను బుధవారం మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహోన్నత వ్యక్తి అని, అతని గొప్పతనం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. దూర దృష్టి గల నాయకుడు మాత్రమే కాదని, తాను సంఘసంస్కర్త, న్యాయ నిపుణుడు, ఆర్థికవేత్త, పండితుడు కూడా అని అన్నారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని, అందరికీ సామాజిక న్యాయం కోసం ఎంతగానో కృషి చేశారని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, సాధికారత వంటి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, అందుకోసం ఏప్రిల్ 14న బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా శాయంపేట 31వ డివిజన్ సుర్జీత్ నగర్ లో విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని సుజిత్ నగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. రాబోయే తరాలకు స్ఫూర్తిగా ఉండడం కోసం, భావితరాల భవిష్యత్తు కోసం అంబేద్కర్ ఎంతగానో కృషి చేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ సుందర్ రాజు యాదవ్, కార్పొరేటర్ సంకు నర్సింగ్, బీఆర్ఎస్ నాయకులు పులి రజినీకాంత్, జోరిక రమేష్, అనిల్, పరుశురాం, జానకి రాములు, సురావు కృష్ణ, శ్రీధర్, ఎర్ర చంద్రమౌళి, స్వామి, మల్లేశం, రఘు, భాగ్యలక్ష్మి, కనకరాజు పాల్గొన్నారు.

# ఘనంగా షేరింగ్ డే సెలెబ్రేషన్స్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని కుమార్ పల్లి న్యూ లయోలా హై స్కూల్ లో షేరింగ్ డే సెలెబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ వంటకాలను తమ ఇంటి నుంచి తీసుకువచ్చి తమ తోటి విద్యార్థులతో పంచుకొని కలిసి భోజనం చేయడం జరిగింది. విద్యార్థులు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు స్కూల్ మేనేజ్ మెంట్ అందరూ కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్ మెంట్ తాడిశెట్టి క్రాంతి కుమార్, కార్తీక్, వైష్ణవి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టు పనులు సకాలంలో పూర్తి చేయండి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆశాజ్యోతి మండల సమైక్య కార్యాలయంలో సమైక్య అధ్యక్షురాలు హైమ, అధ్యక్షతన గ్రామ సంఘాల వీవోఏలకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశాన్ని ఉద్దేశించి అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ముక్కెర ఈశ్వర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ డెవలప్ మెంట్ ప్లానింగ్ లో భాగమైన వీపీఆర్పీ ఆప్ పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, సకాలంలో పూర్తి చేయాల్సిందిగా దిశా నిర్దేశం చేశారు. ప్రాజెక్టు పరమైన అంశాలపై సమీక్ష నిర్వహించి సకాలంలో క్రమశిక్షణతో, పనులు చేసినప్పుడే మంచి మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. ఆ దిశలో అందరూ ప్రయాణించాల్సిందిగా లేకుంటే ప్రాజెక్టు పరమైన చర్యలకు బాధ్యులవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ప్రాజెక్టుకు సంబంధించిన లోకోస్ యాప్ పైన ఏర్పడిన వివిధ సమస్యలకు పరిష్కార మార్గాలను సీబీఓ అడిటర్ వెంకట్ తెలియజేశారు. సఖి కార్యాలయం నుంచి మహిళా చట్టాలు, హక్కులు, సఖి కార్యాలయం ద్వారా చేపడుతున్న కార్యక్రమాల గురించి సైకో సోషల్ కౌన్సిలర్లు ఎండీ నూర్జహాన్, నిర్మలాదేవిలు సమైక్యలో వివిధ గ్రామ సంఘాల సమావేశాలలో మహిళలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ముంజ లక్ష్మి, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు కట్టయ్య, మంజుల, సుజాత, శ్రీలత, ఎంఎస్ఏ రజిత, శ్రీనిధి మేనేజర్ ఫిరోజ్, కంప్యూటర్ ఆపరేటర్ ఉమా, వివిధ గ్రామ సంఘాల వీవోఏలు అస్మా, సుధా, జ్యోతి, మంజుల, శరత్, శ్యామ్, రమేష్, కుమారస్వామి పాల్గొన్నారు.

# ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైన యాకూబ్ షావలి దర్గా

## ఏర్పాట్లు పరిశీలించిన డీపీవో కల్పన, వక్ఫ్ బోర్డ్ అధికారులు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ లో కొలువైన హజ్రత్ సయ్యద్ యాకుబ్ షావళి దర్గా ఉర్సు ఉత్సవాలకు యాకుబ్ షావాలి దర్గా ముస్తాబైంది. వక్ఫ్ బోర్డు కేటాయించిన నిధులతో దర్గాకు పెయింటింగ్, లైటింగ్ పనులు పూర్తి చేశారు. ఈ నెల 27శనివారం నుంచి ఉర్సు ఉత్సవాలు ప్రారంభమై 29 సోమవారం వరకు జరుగనున్న నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా పంచాయతీ అధికారి కల్పన, జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్ స్పెక్టర్ రియాజ్ పాషా, ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంపీవో శ్రీనివాస్, ఎస్సై వీరభద్ర రావులు పరిశీలించారు. ఉర్సు ఉత్సవాల ప్రారంభం నుంచి ముగిసే వరకు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు, ఉత్సవాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ, వక్ఫ్ బోర్డ్ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. భక్తులకు తాగు నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వక్ఫ్ అధికారులను ఆదేశించారు. ఉర్సు ఉత్సవాలకు వచ్చే భక్తులకు వరంగల్, నర్సంపేట, తొర్రూరు నుంచి ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మునుకుంట్ల యశోద, పంచాయతీ కార్యదర్శి మోహిన్, వక్ఫ్ బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

### గంధం ఊరేగింపుకు భారీ బందోబస్తు

ఎస్ఐ వీరభద్రరావు (పర్వతగిరి)



గంధం ఊరేగింపు కోసం భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు . ఈ సందర్భంగా దర్గాను సందర్శించి, అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా భక్తులను లైన్ లో నిలబెట్టడానికి, ట్రాఫిక్ డైవర్షన్, వాహనాల పార్కింగ్, దొంగతనాలు జరగకుండా క్రైమ్ పార్టీ, రోడ్డు ట్రాఫిక్ కంట్రోల్ చేయడానికి ట్రాఫిక్ పార్టీ, గంధం ప్రోగ్రాంలో భాగంగా స్పెషల్ పార్టీ, పోలీసు వారు రెండు షిఫ్ట్ ల వారీగా ప్రతి షిఫ్టులో 8గంటలు విధులు, జాతర కంట్రోల్ రూం ఏర్పాటు చేసి మొత్తం బందోబస్తును కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షణ చేయడం జరుగుతుందని చెప్పారు. భక్తులు, ప్రజలు ఉర్సు ఉత్సవ నిర్వాహకులు పోలీసులకు సహకరించి జాతర విజయవంతం కావడానికి తమ తోడ్పాటును అందించాలని విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా ఎంపీ వద్దిరాజు పుట్టినరోజు వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర జన్మదిన వేడుకలను వరంగల్ తూర్పు బీఆర్ఎస్ నాయకులు అంగరంగ వైభవంగా ఘనంగా జరుపుకున్నారు. పోచమ్మ మైదాన్ జంక్షన్ లో బాణాసంచా కాల్చి భారీ కేక్ ను ఏర్పాటు చేశారు. ముందుగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజ్ కుమార్ కేక్ కట్ చేసి పండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొలుగొడ్డు శ్రీనివాస్, బోల్లికొండ విజయలక్ష్మి, తాంద్ర భాస్కర్, మైనార్టీ నాయకులు ఫక్రుద్దీన్, రవిచంద్ర యువసేన సభ్యులు ఏరుకొండ వినయ్, నాగపురి రమేష్ గౌడ్, బొల్లోజు శ్రీనివాస్, నానావరపు సందీప్, ఎండీ మాస్, సిరిమల్లె కిరణ్, సురేష్, సాయి, మనీ, రబ్బాని షేక్, షారు, ప్రణయ్, బబ్లు, తారక్, నరేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

### భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు..

తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పుట్టినరోజు పురస్కరించుకొని బుధవారంఓరుగల్లు భద్రకాళి దేవి ఆలయంలో దేవస్థాన ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, నాగరాజు శర్మ, అరవింద్ శర్మ, అర్చకుల ఆధ్వర్యంలో రవిచంద్ర వ్యక్తిగత సహాయకులు వీణవంక కిరణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేకంగా తీసుకువచ్చిన గజ పూలమాల పుష్పములతో అమ్మవారిని అలంకరించిన అర్చకులు రవిచంద్ర గోత్రనామాలతో పాటు కుంకుమ అర్చన నిర్వహించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలతో పాటు వేద ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో యువసేన సభ్యులు నాగపురి రమేష్ గౌడ్, సిరిమల్ల కిరణ్, ఏరుకొండ వినయ్ గౌడ్, సింగారం సంతోష్, అరవింద్ యాదవ్, జనగాం మణికంఠ, బొల్లోజు శ్రీనివాస్, బోళ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

# కళాకారిణికి ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని వరంగల్ శివనగర్ కు చెందిన కుసుమ చందన అనే బాలిక బాపు పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ చారిటబుల్ ట్రస్టుచే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ బాలికలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తే ఈ రంగాల నైనా ప్రతిభ పాట వారు పొందడంలో పురస్కారాలు కైవసం చేసుకుంటారు. ఉదాహరణగా నృత్యం, చిత్రలేఖనం, ఆటలు ఇలా అన్ని రకాల లో రాణిస్తారు అన్నారు. ఈరోజు మన ముందున్న చందన ముందు ఉన్న చందన ప్రముఖ దర్శకుడు, ప్రముఖ చిత్రకారుడు బాబు పురస్కారంతోపాటు జై ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రముఖ రచయిత, సినీ నటుడు చేతుల మీదుగాపొందిన సందర్భంగా ఘనంగా సన్మానించడం జరిగినది. ఇంకా ఎంతో అభివృద్ధి చెంది ఉన్నత శిఖరాలు చేరాలని ఈ సందర్భంగా ట్రస్టీ అభినందించారు.

# ఉద్యోగ భద్రత కల్పించాలి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ప్రభుత్వ విప్, డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ హాజరయ్యారు. మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కేలోతు శ్రీనివాస్ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ గత 20 నుంచి 25 సంవత్సరాలుగా మున్సిపాలిటీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారని, వారికి చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా ఉందన్నారు. చాలామంది పిజీలు, డిగ్రీలు చేసి వయోభారం మీద పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు ఉద్యోగ భద్రత కల్పిస్తాయని అనుకుంటే చేసిన పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం లో మున్సిపాలిటీ లో వివిధ కేటగిరీల్లో పనిచేసే కార్మికులకు న్యాయం చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగయ్య, ఉపేందర్, నాగరాజు, గణేష్, అశోక్ రెడ్డి,పద్మ,మల్లమ్మ, లచ్చమ్మ, రాములమ్మ, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనలో శ్రద్ధ చూపాలి

## పెండింగ్ పనులు త్వరగతిన పూర్తి చేయండి
## విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** పట్టణంలోని వార్డులల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో శ్రద్ధ చూపాలని, రాంవిలాస్ గల్లీ పెండింగ్ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రు నాయక్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం వాడివేడిగా జరిగింది. గత కొన్ని నెలలుగా రామ విలాస్ బజార్ రోడ్డు వెడల్పు పనులు కొంత మేర మిగిలి వుండడం వలన డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తమై మురుగు నీరు నిలచి వుండడం వలన దుర్వాసనతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమావేశంలో స్థానిక కౌన్సిలర్ శ్రీను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే, నిబంధనల ప్రకారం పనులు వెంటనే పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కమిషనర్ ను ఆదేశించారు. డివైడర్లపై పెంచిన కోన కార్పస్ మొక్కలను తొలగించాల న్నారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం గురించి సంబంధిత అధికారులతో చర్చించడం జరిగిందని, నిర్మాణం జరిగేలా కృషి చేస్తానన్నారు. ప్రజలకు తాగు నీటి సరఫరా, డ్రైనేజ్, విద్యుత్ దీపాలు, దోమల నివారణ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఇంటి నిర్మాణ పర్మిషన్ కోసం అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ఇబ్బందులు గురి చేస్తున్నారని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా త్వరగా పర్మిషన్ ఇచ్చేలా చూడాలని కమిషనర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ సింధూర రవి, తహసీల్దార్ సైదులు, మున్సిపల్ కమిషనర్ రాజు, బుచ్చిరెడ్డి, కౌన్సిలర్లు, వార్డ్ ఆఫీసర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌ల రిజర్వేషన్ల అంశాన్ని తేల్చాలి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** ఎన్నో సంవత్సరాల నుంచి ఎదురు చూస్తున్న ముదిరాజ్ ల రిజర్వేషన్ల అంశాన్ని తేల్చాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ కోరారు. ప్రభుత్వంతో రిజర్వేషన్ల అంశంపై సంప్రదింపులలో భాగంగా బుధవారం హైదరాబాద్ లో తీన్మార్ మల్లన్నతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రూ.60లక్షల జనాభా ఉన్న ముదిరాజ్ లు అనేక సమస్యలపై చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వెంటనే జీవోనెం.15ను అమలు చేయాలని కోరారు. అంతే కాకుండా తక్షణమే ముదిరాజ్ జనాభాను లెక్కించి జనాభాకు తగిన విధంగా రిజర్వేషన్ ఫలాలు అమలు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ గొంతుక అయిన మెపా ప్రతిపాదించిన విధంగా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని, ఆ మేరకు ప్రభుత్వంతో ప్రకటన వచ్చేలా చూడాలని తీన్మార్ మల్లన్నను కోరారు. అసెంబ్లీ ఎన్నికలలో మద్దతు ప్రకటించిన విధంగానే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో సైతం ముదిరాజ్ లు కాంగ్రెస్ వెంట ఉంటారని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ముదిరాజ్ రిజర్వేషన్ అంశంపై తగిన ప్రకటన వచ్చేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

## గిరిజన విశ్వవిద్యాలయ స్థల పరిశీలన



**వరంగల్ వాయిస్, ములుగు :** గిరిజన విశ్వవిద్యాలయ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డా.ఎ.శరత్ తెలిపారు. బుధవారం గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డా.ఎ.శరత్, డిప్యూటీ రిజిస్ట్రార్ (ఎస్టేట్)అభిషేక్ కుమార్, రిజిస్ట్రార్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ దేవీఎష్ నిగమ్ లతో కలిసి జిల్లా కేంద్రంలోని గట్టమ్మ దేవాలయం ఎదురుగా కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీఓ అంకిత్ జిల్లా కేంద్రంలో దేశంలోనే ప్రతిష్టాత్మకమైన గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు హైదరాబాద్ నుండి విచ్చేసిన కార్యదర్శి, రిజిస్ట్రార్ లకు మ్యాప్ చూపించి, వివరాలను తెలియపరిచారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ గిరిజన యూనివర్సిటీ కోసం మొత్తం 337ఎకరాల స్థలాన్ని సేకరించడం జరిగిందని, సంబంధిత స్థలాన్ని రెవెన్యూ అధికారులు ట్రైబల్ వెల్ఫేర్ శాఖకు బదలాయింపు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ సంవత్సరం యూనివర్సిటీ ఏర్పాటులో భాగంగా తాత్కాలిక తరగతుల నిర్వహణ కోసం ములుగు మండలంలోని ట్రైబల్ యూత్ ట్రైనింగ్ సెంటర్ జకారంలో తరగతులను ప్రారంభించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ కళ్యాణ్ రెడ్డి, ఆర్డీఓ కే.సత్య పాల్ రెడ్డి, ఏఈ సీపీడబ్ల్యూడీ జె.నవీన్, ములుగు తహసీల్దార్ విజయభాస్కర్, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే విలువలు పెరుగుతాయి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** సమాజంలో గౌరవం పొందాలన్న, వ్యక్తిత్వ వికాసం వికసించాలన్న విద్యతోటే సాధ్యమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ తెలిపారు. బుధవారం ఐడీఓసీలోని సమావేశ మందిరంలో ప్రపంచ బాలికల దినోత్సవం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థుల పరీక్షా ఫలితాల శాతాన్ని పెంపొందించుటకై జిల్లావ్యాప్త ప్రేరణ కార్యక్రమాన్ని, సంబంధిత కరపత్రాలు పోస్టర్లు బ్యానర్ను ఆవిష్కరించి ప్రారంభించారు. జ్యోతిప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. చిన్నారులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. తెలంగాణ సాంస్కృతి సారథి కళాకారులు ఆలపించిన గీతాలు విద్యార్థులను ఆలోచింపచేశాయి. అనంతరం సభను ఉద్దేశించి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యనభ్యసించడం ద్వారానే వ్యక్తిత్వం వికసిస్తుందని, ఉన్నతంగా రాణించగలుగుతారన్నారు. ఒక మహిళ విద్యావంతురాలు అయితే ఆ కుటుంబం అంతా ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని గ్రహించాలన్నారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అశోక్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించే ఉచిత ప్రేరణ సదస్సులలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల పరీక్ష ఫలితాలను పెంపొందించుట కొరకు పరీక్షల్లో విజయం సాధించావిజయ అనే అంశంపై ఉచితంగా ప్రేరణ సదస్సులు సైకాలజిస్ట్ల సంఘం సహకారంతో నిర్వహించనున్నామని, విద్యార్థులు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సద్వినియోగపరచుకోవాలని, వివరాలకు ఫోన్ నెంబర్ 9989310141 లలో సంప్రదించాలనితెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రమాదేవి డిప్యూటీ సీఈఓ నర్మద, సీడీపీఓ శిరీష సఖి సెంటర్ నిర్వాహకురాలు శ్రావణి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ డేవిడ్.వి.ఏలియా, జీసీడీఓ విజయ్ కుమారి, డీఎంహెచ్ వో డాక్టర్ అంబరీష తదితరులు విద్యార్థిని విద్యార్థులు తెలంగాణ సాంస్కృతి సారధి కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు దేశానికి గర్వకారణం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** బాలికలు దేశానికి గర్వకారణమని డీడబ్ల్యూవీఓ అధికారులు అన్నారు. బుధవారం బాలిక దినోత్సవ సందర్భంగా మండలంలోని తిమ్మరాని పహాడ్, చింతల గ్రామాలను చైల్డ్ ఇష్యూస్ అక్రమ దత్తత లేని గ్రామాలుగా గుర్తించడం జరిగింది. ఈ గ్రామాల్లో బాలికలను ప్రోత్సహిస్తున్న కార్యదర్శులు మమతా, రాజు, అంగన్వాడి టీచర్లు ఎటుకూరి అరుణకుమారి, దేవి జిల్లా అధికారి శాలువాతో సన్మానించి మెమొంటోను అందించారు.

## జిల్లా స్థాయి ప్రతిభా పోటీలకు క్యాతంపల్లి విద్యార్థులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా గణిత ఫోరం ఆధ్వర్యంలో ధర్మసాగర్ మండల స్థాయి ప్రతిభా పాటవ పోటీలు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల క్యాతంపల్లిలో బండ రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. గణిత ప్రతిభాపాటవ పోటీలలో తెలుగు విభాగంలో జిల్లా పరిషత్ బాలుర సెకండరీ పాఠశాల ధర్మసాగర్ విద్యార్థులు సిద్ధు, మహేందర్, బన్నీలు విజేతలుగా నిలిచి 27న హనుమకొండ జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా స్థాయి ప్రతిభ పోటీలకు ఎంపికయ్యారని గైడ్ టీచర్ కిరణ్మయి తెలిపారు. ఈ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మ ప్రకాష్, ఉపాధ్యాయులు స్వర్ణలత, సురేష్ , పద్మజ , రాజమ్మ ప్రసన్న, సహ విద్యార్థులు అభినందించారు.

## అమంచ కృష్ణమూర్తికి ఆత్మీయ వీడ్కోలు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహించిన అమంచ కృష్ణమూర్తి హైదరాబాద్ కు బదిలీ అయినందున వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంచార్జి ఎంపీడీవో శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో మండల పంచాయతీ ఆఫీసర్ బి రంజిత్ కుమార్, మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాష్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మేకల శ్రీనివాస్, కొప్పుల, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అబ్బు ప్రకాష్ రెడ్డి, మండల కార్యాలయ సిబ్బంది, శాయంపేట మండల ఎంపీటీసీలు, సర్పంచులు, ఎంఎన్ ఆర్ ఈజీఎష్ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## కస్తూర్బాలో బాలిక దినోత్సవం



**వరంగల్ వాయిస్, కాటారం :** కేజీబీవీ కాటారం పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పలురంగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీలకు మెడల్స్ బహుకరించారు. 9వ తరగతి వర్షిణి బృందం ప్రదర్శించిన ఆడపిల్లలపైన జరిగే ఆకృత్యాలు స్కిట్ పలువురినీ కంటతడి పెట్టించింది. జీసీఈసీ (గర్ల్ చైల్డ్ ఎంపవర్ మెంట్ క్లబ్) ఏర్పాటు చేశారు. బాల్యవివాహాలు అరికట్టాలని, బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని ఉపాధ్యాయినీలు, ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కస్తూర్బా గురుకులం ప్రత్యేక అధికారిని చల్ల సునీత ఆడపిల్లలపైన సీస పద్యాన్ని రచించి ఆలపించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చల్ల సునీత, సుజాత, రాజమణి, విజయ, కవిత, నళిని, లక్ష్మి, శిరీష, నాజియా, దివ్య, మణిమాల, సరిత, స్వప్న, శ్రీలత, పి.ఇ.టి రాజేశ్వరి, ఏఎన్ఎమ్ లక్ష్మి, విద్యార్థినీలు పాల్గొన్నారు.

# ఆంజనేయుడుగా రానా ?



టాలీవుడ్ లేటెస్ట్ సెన్సేషన్ ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో వచ్చిన తాజా చిత్రం 'హనుమాన్' భారీ విజయంతో సీక్వెల్‌గా జై హనుమాన్ ప్రకటించారు. తేజ సజ్జా కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ దగ్గర సంచలనాలు సృష్టిస్తుంది. ఇప్పటివరకు ఈ చిత్రం వరల్డ్‌వైడ్‌గా రూ.200 కోట్ల వసూళ్లు రాబట్టింది. ఇదిలావుంటే ఈ సినిమా ముగింపులో సీక్వెల్ ఉంటుందని ప్రశాంత్ వర్మ ప్రకటించిన విషయం తెలిసిందే. 'హనుమాన్'కు సీక్వెల్‌గా రానున్న 'జై హనుమాన్ కు సంబంధించి ఇప్పటికే స్క్రిప్ట్ కూడా సిద్ధమయిపోయిందని ప్రశాంత్ వర్మ వెల్లడించాడు. దీంతో ప్రేక్షకులంతా సెకండ్ పార్ట్ 'జై హనుమాన్' కోసం ఎంతో క్యూరియాసిటీతో ఎదురు చూస్తున్నారు. కాగా ఈ సినిమాలో హనుమంతుడిగా ఎవరు కనిపించబోతున్నారనేది అందరిలో ఆసక్తి నెలకొంది. అయితే ఈ సినిమాలో హనుమంతుడిగా కనిపించబోయేది ఇతడే అంటూ టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి గురించి సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. రానా కూడా హనుమంతుడి రోల్‌లో బాగా సెట్ అవుతాడని సోషల్ మీడియాలో నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇక దీనిపై అధికారిక ప్రకటన రాకపోగా.. దర్శకుడు ప్రశాంత్ వర్మ క్లారిటీ ఇవ్వవలసి ఉంది. ఇక ఈ సినిమా 2025లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## డిఫరెంట్‌గా అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్



చిన్న చిన్న పాత్రలతో కమెడియన్‌గా మొదలెట్టి ఇప్పుడు కథానాయకుడిగా కూడా సినిమాలు చేస్తున్న సుహాస్ 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' అనే నూతన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. దీనికి నూతన దర్శకుడు దుష్యంత్ కటికనేని దర్శకుడు. తాజాగా ఈ చిత్రం ట్రైలర్ విడుదలైంది, ఇందులో కామెడీ, చిన్న క్రైమ్, వూర్లో వుండే చిన్న చిన్న గొడవలు కలగలిపి ఒక కథగా మలిచినట్టుగా తెలుస్తోంది. సెలూన్ షాపు నడిపే సుహాస్ ఆ వూర్లో ఏమి జరిగినా అన్నిటిని తనమీదే వేసుకొని ఎలా చిక్కుల్లో పడ్డాడు, వాటినుంచి ఎలా బయటపడ్డాడు అనే ఇతివృత్తంగా ఈ ట్రైలర్ చూస్తుంటే కనపడుతోంది. ఇంతకు ముందు సుహాస్ 'కలర్ ఫోటో' అనే చిత్రంలో కథానాయకుడిగా నటించి మంచి పేరు తెచ్చుకున్నాడు, జాతీయ అవార్డు కూడా వచ్చింది ఆ సినిమాకి. ఆ తరువాత 'రైటర్ పద్మభూషణ్', 'మను చరిత్ర' అనే రెండు సినిమాలో నటించాడు. ఇప్పుడు ఈ 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' తో ఫిబ్రవరి 2న వస్తున్నాడు. బన్నీవాస్, వెంకటేష్ మహా ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు, నిర్మాత ధీరజ్ మొగిలినేని. సుహాస్ సరసన శివాని నగరం అనే అమ్మాయి కథానాయికగా చేస్తుండగా, గోపరాజు రమణ ఇంకో ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. కొత్త నటులకి ఈ సినిమా ద్వారా అవకాశం కలిపించినట్టుగా కనపడుతోంది.

## జై శ్రీరామ్ పోస్ట్‌కు నెటిజన్ల విపరీత వ్యాఖ్యలు

### ఘాటుగా రిప్లై ఇచ్చిన అమ్మడు

టాలీవుడ్ నటి రష్మి గౌతమ్ గురించి పెద్దగా పరిచయం అక్కర్లేదు. జబర్దస్త్ షో ద్వారా యాంకర్‌గా బుల్లితెరకు పరిచయమై ప్రేక్షకుల్లో భారీ క్రేజ్ సంపాదించుకుంది. ఈ షో ద్వారా వచ్చిన క్రేజ్‌తో బిగ్ స్క్రీన్‌పై అప్పుడప్పుడు మెరుస్తోంది. మరోవైపు సోషల్ మీడియాలో లేటెస్ట్ ఫొటో షూట్స్‌తో అభిమానులను అలరిస్తూ ఉంటుంది. ఇదిలావుంటే రష్మి తాజాగా ఓ నెటిజన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవంపై ఆనందం వ్యక్తం చేస్తూ రష్మి ఇటీవల ఒక పోస్ట్ చేసింది. అయితే ఈ పోస్ట్‌పై నెటిజన్ రిప్లయ్ ఇస్తూ.. కాషాయపు రంగు చీర కట్టి.. అన్నీ చెడ్డ పనులు చేస్తున్నావు. అంటూ కాస్త అసభ్య పదజాలం వాడాడు. దీంతో రష్మికి మండిపోయినట్టుంది. ఆ ట్వీట్‌కు రిప్లై ఇస్తూ గట్టిగా కౌంటర్లు వేసింది. నేనేమైనా బిల్లులు కట్టకుండా డబ్బులు ఎగ్గొట్టానా? లేదా నా తల్లిదండ్రుల్ని రోడ్డున వదిలేశానా? నా కుటుంబ బాధ్యతలు తీసుకోలేదా?.. ట్యాక్సులు కట్టలేదా?.. నేనేమైనా అసాంఘిక కార్యకలాపాలు, అకృత్యాలు చేశానా? ఎవరి దగ్గరైనా డబ్బులు లాగేసుకున్నానా? మీ దృష్టిలో అసభ్యకరమైన పనులంటే ఏమిటి? ఈ మధ్య కాలంలో ఇలాంటి మాటలు ఎక్కువగా వింటున్నా. పదే పదే ఈ పదంతో నన్ను టార్గెట్ చేస్తున్నారు.. నా వరకు దేవుడి అందరి వాడు అంటూ రష్మి గౌతమ్ గట్టి కౌంటర్ ఇచ్చింది.







## ఇలా మిస్ అవటం ఇదే మొదటి సారి ఏమో

### స్నేహితుల మధ్య నమ్రత పుట్టినోజు వేడుకలు

సూపర్ స్టార్ మహేష్ బాబు భార్య నమ్రత శిరోద్కర్ తన పుట్టినరోజుని హైదరాబాదులో ఎంతో సంబరంగా జరుపుకున్నారు. మహేష్ బాబు జర్మనీలో ప్రత్యేక శిక్షణ కోసం వెళ్లారు, బహుశా నమ్రత పుట్టినరోజుని మహేష్ ఇలా మిస్ అవటం ఇదే మొదటి సారి ఏమో. అయితే నమ్రత తన స్నేహితులు చాలామందిని పిలిచారు, అందరూ హాజరయ్యారు. అలాగే తన కుటుంబ సభ్యులు కూడా చాలామంది హాజరయ్యారు. ఈసారి పుట్టినరోజు ఎంతో సంబరంగా, ఒక మంచి జ్ఞాపకంగా చేసుకున్నారు నమ్రత. మహేష్ బాబు సోదరీమణులు మంజుల, ప్రియదర్శిని, పద్మావతి తో పాటు రమేష్ బాబు భార్య కూడా నమ్రత పుట్టినరోజు సంబరాలకు హాజరైన వారిలో వున్నారు. ఇక తన పిల్లలు సితార, గౌతమ్ కూడా నమ్రత దగ్గరే వున్నారు. చాలామంది సెలెబ్రెటీలు హాజరయ్యారు. నారా లోకేష్ భార్య నారా బ్రాహ్మణి వచ్చినవారిలో వున్నారు. అలాగే అల్లు అర్జున్ భార్య అల్లు స్నేహ రెడ్డి కూడా ఈ పుట్టినరోజుకి హాజరయ్యారు. ఇక పింకీ రెడ్డి, దీప్తి రెడ్డి, మంజుల రెడ్డి ఇలా చాలామంది నమ్రత పుట్టినరోజుకి హాజరైన వారిలో వున్నారు. సినీ నటి కీర్తి సురేష్ కూడా హాజరైనట్టుగా తెలుస్తోంది. అలాగే నమ్రత స్నేహితులు చాలామంది వచ్చి ఈ వేడుకని మరింత సంబరంగా ఉండేట్టు చేశారు. ఇప్పుడు ఈ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతూ వున్నాయి.



# లక్ష్య సాధన దిశగా బాలికలు కృషి చేయాలి

**పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**ఘనంగా జాతీయ బాలిక దినోత్సవం**

**ఉత్తమ ఫలితాలు సాధించిన పది, ఇంటర్ బాలికలకు రూ.లక్ష నగదు ప్రోత్సాహం**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బాలికలు లక్ష్య సాధన దిశగా కృషి చేసి భవిష్యత్ దిశా నిర్దేశం చేసుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం జాతీయ సాంకేతిక సంస్థ (ఎన్ఐటి) ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకలు జిల్లా సంక్షేమ అధికారి కె.మధురిమ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ బాలికలు లక్ష్య సాధనలో అనేక అడ్డంకులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అయితే వాటిని సవాల్ గా స్వీకరించి అనుకున్న లక్ష్యాలను సాధించి ఆదర్శంగా నిలవాలన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో పది, ఇంటర్ లో జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన వారికి తన జీతంలో చెరో లక్ష రూపాయలు చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. చదువును నిర్లక్ష్యం చేయకుండా ఉన్నతమైన ఆశయాలు, విలువలతో ఎదగాలను ఆకాంక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ బాలికలందరికీ సావిత్రిబాయి పూలే ఆదర్శనీయమన్నారు. ఎన్నో అవరోధాలను అధిగమించి స్త్రీ విద్యకు సావిత్రిబాయి పునాది వేసిందని, తన జీవితాన్ని ఆదర్శంగా చేసుకొని జీవితంలో ఎదురయ్యే సమస్యలను చదువు అనే ఆయుధంతో సాధించవచ్చున్నారు. నేడు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కువ మంది ఐఏఎస్ అధికారులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని అందులో నేను ఒక్కరిని అని భావించి ప్రణాళికా బద్ధంగా చదివి ఉన్నతంగా నిలువాలన్నారు. బాలికా దినోత్సవం రోజు మాత్రమే కాకుండా నిరంతర వారి రక్షణ కోసం ప్రభుత్వ శాఖల అధికారులు కృషి చేయాలని, గ్రామ స్థాయి బాలల పరిరక్షణ కమిటీలు పాటుపడాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి కె.మధురిమ మాట్లాడుతూ జిల్లాలోని మూడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధి మండలాలు గ్రామాల్లో కమిటీలను బలోపేతం చేసి బాలల న్యాయ చట్టం మార్గదర్శకాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ చట్టంపై గ్రామీణ పట్టణ మండల జిల్లా స్థాయిలో వివిధ రూపాలలో అవగాహన కల్పిస్తున్నామని పోలీస్, విద్య, మహిళా శిశు సంక్షేమ శాఖ, మరియు స్వచ్ఛంద సంస్థల సహకారంతో మరిన్ని అవగాహన సదస్సులు నిర్వహించి బాలిక సంరక్షణ కోసం కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా బాలసదనం, రీచ్ సంస్థల బాలికలు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కాగా జిల్లా రాష్ట్ర స్థాయిలో వివిధ క్రీడల్లో ప్రతిభ కనపరచిన కస్తూర్బా బాలికల పాఠశాలలోని ఐదుగురు విద్యార్థినులకు, మహిళా శిశు, బాలికా సాధికారత కోసం కృషి చేసిన మహిళా అధికారులకు ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డుతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సందసాని రాజేంద్ర ప్రసాద్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర ఈసీ మెంబర్ ఈవీ శ్రీనివాస రావు, స్థానిక కార్పొరేటర్లు మామిడాల రాజు, మానస రాంప్రసాద్, సీడీపీఓ స్వరూప, జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ డి.కళ్యాణి, డీసీపీఓ పి.సంతోష్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్.ప్రవీణ్ కుమార్, సీనియర్ సహాయకులు వి.వెంకట్ రామ్, స్వర్ణ, లావణ్య, మాధవి, ఐసీడీఎస్ సూపర్వైజర్లు రాజ్యలక్ష్మి, శిరీష, కవిత, రాజ్యలక్ష్మి, బాలసదనం సూపరింటెండెంట్ కళ్యాణి, సఖి, వివిధ శాఖల అధికారులు, అంగన్వాడి టీచర్లు, సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల గిరిజన ఆశ్రమ పాఠశాల, పింగిలి ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.




# రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలు విజయవంతం చేయాలి

**టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఫిబ్రవరి 11, 12న ఖమ్మంలో జరిగే టీపీటీఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభల గోడ పత్రిక ఆవిష్కరణ బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల సుబేదారిలో చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ మాట్లాడుతూ 1944లో ఏర్పడిన ఏపీటీఎఫ్ ఏడు దశాబ్దాలుగా విద్యారంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంస్థాపరంగా విద్యా వ్యాప్తికి ఐక్య వేదిక ద్వారా ఎన్నో ఉద్యమాలు నిర్వహించిందన్నారు. అందరికి సమాన విద్య అందాలని ఎజెండగా పనిచేసిందని తెలిపారు. కోట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తే నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ దర్శిని సంపాదకుడు వి.అజయ్ బాబు, పూర్వ రాష్ట్ర కార్యదర్శి బెల్లం కొండ రమేష్, పూర్వ ఉపాధ్యాయ దర్శిని సంపాదకుడు బైరి స్వామి మాట్లాడుతూ అంతరాలు లేని ఉచిత విద్య, కామన్ స్కూల్ విద్యా విధానం, శాస్త్రీయ విద్య కోసం ఖమ్మంలో జరిగే విద్య వైజ్ఞానిక మహాసభలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యను కాంక్షించే వారందరూ పాల్గొనాలని కోరారు. ప్రొఫెసర్ బుర్ర రమేష్, ఏ.నరసింహారెడ్డి, ప్రొఫెసర్ కాశీం, వేణుగోపాల్, ప్రసాద్ లాంటి విద్యా మేధావులతో ప్రసంగాలతో పాటు ఉపాధ్యాయులు, విద్యాభిమానులు సమాజంలో మార్పును కాంక్షించే సందేశాలుంటాయన్నారు. ఖమ్మంలో జరిగే విద్య వైజ్ఞానిక మహాసభలకు ఉపాధ్యాయులు విద్యాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వెంకటేశ్వర్లు, పూజారి మనోజ్, ఉపాధ్యక్షులు జె.స్వామి, కార్యదర్శులు డి.మల్లయ్య, బందు ప్రసాద్, ఈదుల వీరాస్వామి, ఉమ్మడి జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి ఉత్కూరి అశోక్, బీమళ్ల సారయ్య, సురేష్ గుప్తా, ఛక్రు నాయక్, జి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ బలోపేతానికి కృషి

## వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా పరిధిలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ తెలిపారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన బీజేపీ పార్లమెంట్ బోర్డు సభ్యులు, కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యులు, ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ మెంబర్ డాక్టర్ కె.లక్ష్మణ్ తోపాటు జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర ఇంచార్జి సునీల్ బన్సాల్ ని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి వారి సలహాలు, సూచనలు అందజేయాలని రవికుమార్ కోరారు.

# ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలి



**వరంగల్ వాయిస్, అగ్రంపాడ్ :** వచ్చే నెలలో అంగరంగ వైభవంగా జరుగనున్న అగ్రంపాడ్ సమ్మక్క-సారలమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశించారు. గుడెప్పాడు మీదుగా వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పోలీస్ అధికారులతో పాటు ట్రైనీ ఐపీఎస్ శుభం నాగ్ కు సూచనలు, సలహాలు అందజేశారు. అగ్రంపాడ్ సమ్మక్క సారలమ్మ గద్దెలకు చేరుకున్న సీపీకి ఆలయ అధికారులు, పూజరులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతర సంబందించి వాహన పార్కింగ్, క్యూ లైన్లు, పోలీస్ సిబ్బంది వసతులు, కంట్రోల్ రూం ఏర్పాట్లపై సంబందిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు మెరుగైన సైకర్యాలు కల్పించాలని సూచించారు.

### బాధితులకు సత్వరమే న్యాయం చేయాలి..

పోలీస్ స్టేషన్ వచ్చే ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశించారు. ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా రీసెప్షన్, కమాండ్ కంట్రోల్ రూంతో పాటు స్టేషన్ లోని వివిధ విభాగాల్లో అధికారులు, సిబ్బంది పనితీరుపై కమిషనర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో ట్రైనీ ఐపీఎస్ శుభం నాగ్, ఆత్మకూర్ ఇన్స్ స్పెక్టర్ రవిరాజ్, ఎంఆర్ ఓ జగన్ మోహన్, ఈఓ శేషగిరి ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ఇంటలెక్చువల్ మీటింగ్‌లో డాక్టర్ రామకృష్ణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర హెల్త్ మినిస్టర్ దామోదర రాజనర్సింహతో కలిసి హైదరాబాద్ లో జరిగిన మాదిగ చామర్ ఇంటలెక్చువల్ మీటింగ్ లో వరంగల్ ఎంపీ ఆస్పిరెంట్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పెరుమాళ్ళ రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ మేధావి అయిన మాదిగ చామర్ ఇంటలెక్చువల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి హెల్త్ మినిస్టర్ దామోదర రాజనర్సింహ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com